
సాక్షి పల్నాడు

ఆదివారం । 19 । జనవరి । 2025




వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అడిగొప్పల చెన్నకేశవాచార్యులుచే అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు శనివారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 666 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 561.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

సబ్‌జైల్‌లో న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీలు



గురజాల: సబ్‌జైల్‌ను మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, 10వ అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జైలులో ఎవరైనా కుల వివక్షకు గురవుతున్నారా...? కులం పరంగా ఇబ్బందులు ఏమైనా ఎదురవుతున్నాయా? అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కుల పరంగా ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ హెల్ప్ లైన్ నెంబరు 15100కు ఫోన్ చేయాలన్నారు. వెంటనే సత్వర న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం స్టోర్ రూమ్‌లో గల ఫిర్యాదు బాక్స్‌లను పరిశీలించారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, ప్రభుత్వ వైద్యుడు సాయి కర్ణ కుమార్ యాదవ్, న్యాయవాది కె.ప్రభుదాసు, సబ్‌జైలర్ సీహెచ్‌వీఎన్ సుబ్బారెడ్డి తదితరులున్నారు.

మిర్చి పంట పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

అచ్చంపేట: పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గి, మద్దతు ధరలేక, భరోసా రాక, తెగుళ్లబారిన పడి దిగాలు పడ్డ రైతన్నల దుస్థితిపై 'నల్లిగిపోతున్న మిర్చి రైతులు' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఉద్యాన శాఖాధికారిణి శ్రీనిత్య స్పందించారు. పెదపాలెం, నీలేశ్వరపాలెం, కొత్తపల్లి, అచ్చంపేట గ్రామాలలో మిర్చి పంటలను పరిశీలించారు. తెగుళ్లు ఉన్నట్లు గమనించారు. నల్లి, ఎర్రనల్లి, నల్లతామర తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన సూచనలను రైతులకు వివరించారు. గత యేడాదికన్నా దిగుబడులు తగ్గడానికి కారణాలను వివరించారు. మద్దతు ధర నిర్ణయించాల్సింది ప్రభుత్వమని తమ పరిధిలో ఉండదన్నారు. మితిమీరి మందులు వాడొద్దని, వాడినందువల్ల పెట్టుబడులు పెరుగుతాయే తప్ప దిగుబడులు పెరగవని చెప్పారు. ఆమెతో పాటు రైతు సేవా కేంద్రం సిబ్బంది నాగమణి, ఎనోష, మణి, రాంకుమార్, రైతులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించండి

అచ్చంపేట: తెగుళ్ల బారిన పడిన మిర్చి దిగుబడులను గణనీయంగా కోల్పోయామని, పెట్టుబడులు బాగా పెరిగాయని, మద్దతు ధర ప్రకటించి తమను ఆదుకోవాలని రుద్రవరం మిర్చి రైతులు శనివారం నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు మొరపెట్టుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన తాను ఇప్పటికే ఈ విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లానని మరొక్కసారి సీఎంతో మాట్లాడి మద్దతు ధర ప్రకటించేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.

చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించిన ఎస్పీ

గురజాల: ఈనెల 15వ తేదీన గురజాలలో దొంగతనం జరిగిన ఇళ్లను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయవాది ఆచంట శ్రీనివాసరావు, శేషయ్య ఇళ్లలో జరిగిన దొంగతనం గురించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఇళ్లల్లో ఎవరూ లేకుండా ఉండాల్సివస్తే ఎల్‌హెచ్‌ఆర్‌ఎం యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఎస్పీతో పాటు డీఎస్పీ జగదీష్, సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వినోద్ కుమార్‌లు ఉన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి రూ. 55,78,843 ఆదాయం

మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఎగువ సన్నిధి, దిగువ సన్నిధి, శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం హుండీల లెక్కింపును శనివారం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఆవరణలో లెక్కించారు. మొత్తం ఆదాయం రూ. 55,78,843 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి వెల్లడించారు. ఇందులో లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన ఎగువ సన్నిధిలో రూ. 24,87,319, దిగువ సన్నిధిలో రూ. 29,93,901, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రూ. 62,250, అన్నదాన సత్రంలోని హుండీ ద్వారా రూ. 33,373 వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది రూ. 5,71,509 అధికంగా వచ్చిందని పేర్కొన్నారు.

అడ్డంగా దోచేయ్..

- నదికి అడ్డంగా రోడ్లు.. నదీ గర్భానికి తూట్లు
- ఆ రోడ్డు నుంచే యథేచ్ఛగా రవాణా
- పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వకాలు
- నదికి అడ్డంగా రహదారితో ప్రశ్నార్థకంగా వ్యవసాయ భూములకు సాగునీరు
- రైతుల ఇబ్బందులు పట్టించుకోని అక్రమార్కులు
- ఇటీవల కొంతకాలం ఆగిన తవ్వకాలు
- మళ్లీ అక్రమ దందాకు తెరలేపిన వైనం
- ప్రశ్నించే సాహసం చేయని అధికారులు

అధికార పార్టీలోని లుకలుకలు బయటపడి, పరస్పర ఫిర్యాదులతో ఇటీవల కొంతకాలంగా ఆగిన ఇసుక అక్రమ రవాణా.. ఏమైందో ఏమో.. సంక్రాంతి అనంతరం మళ్లీ ఊపందుకుంది. ఈ దఫా పెద్ద పెద్ద యంత్రాలతో నదీ గర్భానికి, ఎన్‌జీటీ నిబంధనలకు సైతం తూట్లు పెడుతూ ఇసుక అడ్డంగా తోడేస్తూ.. నదికి అడ్డంగా నిర్మించిన రహదారిపై యథేచ్ఛగా తరలిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఈక్రమంలో రైతుల ఇబ్బందులను గాలికొదిలేశారు.. అడ్డుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

కోనూరులో మళ్లీ ఇసుక అక్రమ దందా



కోనూరు ఇసుక రీచ్ వద్ద పెద్దపెద్ద పొక్లెయిన్‌లతో లారీలకు ఇసుక నింపుతున్న దృశ్యం

అచ్చంపేట: తమ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహించొద్దని సంబంధిత అధికారులు అడ్డు చెప్పడంతో కొన్ని రోజులుగా ఇసుక తవ్వకాలు, ఇసుక రవాణాను నిలిపివేసిన అక్రమార్కులు మళ్లీ కొనసాగిస్తున్నారంటే ఏమనాలి.. నదికి అడ్డంగా రోడ్డు వేసి, పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వకాలు నిర్వహించేందుకు అనుమతులు వచ్చాయా... అధికారులతో లాలూచీ పడ్డారా...లేక బెదిరించారా.. వర్గపోరుకు తెరపడిందా.. మమ్మల్నేం చేయలేరన్న ధైర్యమా..అడ్డొస్తే దాడిచేద్దామన్న ఉద్దేశ్యమా.. అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా నదికి అడ్డంగా రోడ్డు వేసి మరీ నదీ గర్భంలో పెద్ద పెద్ద యంత్రాలతో తవ్వకాలు చేస్తూ, భారీ వాహనాలతో మళ్లీ ఇసుక అక్రమ తరలింపునకు తెరలేపారు అక్రమార్కులు.

ఫిర్యాదులతో ఇటీవల ఆగిన వైనం..

పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలంలోని కోనూరు ఇసుక రీచ్‌లో ఇసుకను నదిలో నుంచి పడవలద్వారా ఒడ్డుకు చేర్చేందుకు క్యూబిక్ మీటరు ఒక్కంటికి రూ.109లకు మెస్సర్స్ సాయి క్యూ అండ్ ఎస్ సెల్యూషన్స్ వారు గత అక్టోబరులో టెండరు విధానం ద్వారా హక్కులు పొందారు. అయితే వీరు కోనూరు ఇసుక రీచ్‌నుంచి ఇసుక రవాణా చేసేందుకు అనుకూలంగా కృష్ణానదికి అడ్డంగా రోడ్డు వేసి, భారీ యంత్రాలతో తవ్వకాలు నిర్వహించేందుకు సిద్ధపడ్డారు. అయితే అధికార పార్టీలో అంతర్గత వర్గపోరుతో వాటాలు కుదరక జిల్లా అధికారులకు పరస్పర ఫిర్యాదులు చేసుకోవడంతో అధికారుల ఆదేశాల మేరకు ఇటీవల తవ్వకాలు, రవాణా నిలిపివేశారు.

అదే సీన్ రిపీట్...

అయితే శుక్రవారం సాయంత్రం నుంచి నదికి అడ్డంగా గతంలో వేసిన రోడ్డుపైనే మళ్లీ అక్రమదందా నిర్వహిస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలతో లెక్కకు మించి తవ్వకాలు చేసి భారీ లారీలతో ఇసుక రవాణా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం అడ్డు చెప్పలేకపోతున్నారు. కనీసం అడ్డుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. దీనిపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నదికి అడ్డంగా రోడ్డు వేయడం వల్ల దిగువలో ఉన్న వ్యవసాయ భూములకు సాగునీరు అందని పరిస్థితులున్నాయి. అక్రమార్కులు వాటిని కూడా ఖాతరు చేయడంలేదు. రైతులు మాత్రం లబోదిబోమంటున్నారు. అయినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఎలాంటి అనుమతులు చూపించలేదు

అనుమతులు లేకుండా నదికి అడ్డంగా రోడ్డు వేయొద్దని, భారీ యంత్రాలతో తవ్వకాలు చేయవద్దని గతంలోనే రీచ్ నిర్వాహకులకు స్పష్టంగా చెప్పాం. అప్పుడు ఇసుక రవాణాను నిలిపివేశారు. మళ్లీ ఇప్పుడు ఇసుక రవాణా, తవ్వకాలు నిర్వహిస్తున్న విషయం తెలియదు.. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు మాకు ఇంత వరకు చూపించలేదు. మా సిబ్బందిని పంపి అడ్డుకుంటాం.

– జి.శ్రీనివాసయాదవ్, తహసీల్దార్, అచ్చంపేట



నదికి అడ్డంగా వేసిన రోడ్డుపై నుంచి వెళుతున్న ఇసుక లారీలు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

అదనపు ఎస్పీ జేవీ సంతోష్



జెండా ఊపి రోడ్డు భద్రతా వాహనాన్ని ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ సంతోష్

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు భద్రతా నియమాలను పాటించకపోవడమేనని అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా రోడ్డు సేఫ్టీ ఎస్‌జీఓ. కన్వీనర్ బీకే దుర్గాపద్మజ రూపొందించిన ప్రచార రథాన్ని జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ విశ్రాంతి లేకుండా ఎక్కువ దూరం వాహనం నడపడం, వ్యతిరేక దిశలో ప్రయాణించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, అతివేగం, టర్న్ తీసుకునేటప్పుడు చుట్టూ వున్న వాహనాలను గమనించకపోవడం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, ఇతర వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రయాణించేటప్పుడు లైన్ డిసిప్లేన్ పాటించాలని సూచించారు. జిల్లా రవాణా అధికారి ఎ.సంజీవకుమార్, ట్రాఫిక్ సీఐ సీహెచ్ లోకనాథం, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎంఎల్.వంశీకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ వేణు, రోడ్డుసేఫ్టీ సభ్యులు బంగారయ్య పాల్గొన్నారు.

గమ్ మత్తుగా చిత్తు!

సింథటిక్ రబ్బర్ గమ్ వ్యసనం బారిన యువత

- దాన్ని పీల్చుతూ అలౌకిక ఆనందం
- మార్కెట్‌లో విచ్చలవిడిగా దొరుకుతున్న వైనం
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



కృష్ణానది ఒడ్డున దొరికిన నల్లబ్యాగులో పిండిన బోన్‌ఫిక్స్ ద్రవం



మార్కెట్‌లో అమ్ముతున్న బోన్‌ఫిక్స్ సింథటిక్ రబ్బర్ గమ్

అమరావతి: రెక్సిన్, ఫోమ్, వుడ్, ప్లైవుడ్, మెటల్‌లను అంటించటానికి, అలాగే విరిగిపోయిన ప్లాస్టిక్ వస్తువుల అంటించటానికి ఉపయోగించే సింథటిక్ రబ్బర్ అదేషివ్ గమ్ బోన్‌ఫిక్స్ యువకుల పాలిట శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పలు గ్రామాలలో సుమారు 15 సంవత్సరాల పైబడిన బాలురు, యువకులు మత్తుకు అలవాటు పడి.. ఎలాగైన మత్తులో ఉన్న గమ్మత్తును అనుభవించాలనే ఆతృతతో తక్కువ ధరకు మార్కెట్ సులభంగా దొరికే బోన్‌ఫిక్స్ గమ్ వినిమోగిస్తున్నారు.

ప్రమాదాన్ని 'ఆస్వాదిస్తూ..'

మద్యం కొనుగోలు చేయాలంటే సుమారు రూ.100-150 ఖర్చు అవుతుంది. అందువల్ల తక్కువ ఖర్చుతో అదే మత్తును ఇస్తున్న బోన్ ఫిక్స్‌వైపు బాలురు, యువకులు మొగ్గు చూపుతున్నారు. మందు తాగాలంటే గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, తినటానికి చిరుతిండి అంత హంగామా అవసరం. అదే బోన్‌ఫిక్స్, నల్లప్లాస్టిక్ క్యారీబ్యాగ్ ఉంటే చాలు మత్తుతో స్వర్గం అంచుల్లో తేలిపోవచ్చునని యువత ఎగబడి కొంటున్నారు. నల్లక్యారీబ్యాగ్‌లో బోన్‌ఫిక్స్ వేసి గాఢంగా ముక్కుతో పీల్చి ప్రమాదకరరీతిలో మత్తును ఆస్వాదిస్తున్నారు. అలా రోజుకు రెండు, మూడుసార్లు మండలంలోని మారుమూల ప్రదేశాలైన కృష్ణానది ఒడ్డున, జగనన్న కాలనీలలో, రియల్ ఎస్టేట్ వెంచర్‌లలో బాలురు, యువకులు గుంపులుగా చేరి అందులో వచ్చే మత్తును అనుభవిస్తున్నారు.

అత్యంత చవకగా..

రెండేళ్ల క్రితం బోన్‌ఫిక్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన ఏర్పరచటానికి పోలీసుశాఖ మండల కేంద్రమైన అమరావతిలో అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి యువతకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అదేవిధంగా షాపులలో బోన్‌ఫిక్స్ అమ్మకాలపై పలు షరతులు విధించారు. దీనివల్ల కొంత కాలం అమ్మకాలు తగ్గాయి. అయితే ప్రస్తుతం విక్రయాల జోరు మళ్లీ పెరిగింది. గతంలో రోజుకు 10 నుంచి 15 బోన్‌ఫిక్స్ ట్యూబులు అమ్ముడుపోవడమే గగనమవగా.. నేడు మండలంలో 800 నుంచి 1000 వరకు బోన్‌ఫిక్స్ ట్యూబులు అమ్ముడు పోతున్నట్లు సమాచారం. రూ.12 మాత్రమే ఉండే 10 గ్రాముల బోన్‌ఫిక్స్‌ను వ్యాపారులు ఇదే అదనుగా రూ.25 వరకు అమ్ముతున్నారు.

ఆరోగ్యంపై పెనుప్రభావం

బోన్‌ఫిక్స్‌ను పీల్చడం వల్ల ఆరోగ్యంపై పెనుప్రభావం చూపే అవకాశం ఉంది. ఇందులోని రసాయనాల గాఢత వల్ల నరాల బలహీనత, జీర్ణశక్తి తగ్గిపోవడం, బరువు తగ్గిపోయి బాలురు, యువకులు నిరసించి పోతున్నారు. అంతేకాకుండా ఒకసారి ఇది తీసుకున్న తర్వాత మళ్లీమళ్లీ తీసుకోవాల్సిన వ్యసనంలోకి వీరంతా మారుతున్నారు. ఈ ఉత్ప్రేరకాన్ని తీసుకుని మత్తులో సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు సైతం పాల్పడి అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం ఉంది. ఇటువంటి వాటిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుని బాలురు, యువతను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే



కలెక్టరేట్‌లో మొక్క నాటుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే

నరసరావుపేట: ప్రతి ఉద్యోగి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛత దివస్–స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు చేత పరిసరాలు పరిశుభ్రం చేయించారు. అనంతరం పచ్చదనం పెంపొందించే చర్యలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి నెల మూడో శనివారం విధిగా ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మురళి, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారి భానుకీర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేశారు.

రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

నరసరావుపేట రూరల్: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20వ తేదీ నుంచి 31 వరకు నిర్వహించనున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే తెలిపారు. తన కార్యాలయంలో శనివారం పశువైద్య శిబిరాల పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, ఏడీ రామచంద్రరావు, పశువైద్యులు శ్రీధర్, వంశీ, సాయిమహేష్‌రెడ్డి, అర్జున్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. డాక్టర్ కె.కాంతారావు వివరాలు తెలుపుతూ ప్రతి గ్రామంలో అన్ని పశువులకు పశువైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్యంతో పాటు తేలికపాటి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని తెలిపారు. గర్భకోశ వ్యాధులకు పరీక్షలు జరిపి వైద్యం అందిస్తారని తెలిపారు. శిబిరాలలో పశువులతో పాటు చిన్న దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు ఉచితంగాతాగిస్తారని పేర్కొన్నారు. దీంతో వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తారని వివరించారు. ఆరోగ్య శిబిరాలలో 65 జట్లుగా పశువైద్య సిబ్బంది పాల్గొని సేవలు అందిస్తారని తెలిపారు. జిల్లాలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్



ప్రొఫెసర్లతో 1975 బ్యాచ్ వైద్య విద్యార్థులు

- ఉత్సాహంగా గుంటూరు వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- వైభవంగా స్వర్ణోత్సవాలు

గుంటూరు మెడికల్: ఆనాటి ఆ స్నేహం మధురాతి మధురం అంటూ కాలేజీ రోజులను వైద్యులు నెమరు వేసుకున్నారు. తరగతి గదుల్లో కూర్చుని 50 ఏళ్ల వెనక్కి వెళ్లిపోయారు. యవ్వనంలో చేసిన అల్లరిని జ్ఞప్తికి తెచ్చుకుని పులకించి పోయారు. నాటి చిలిపి పనులు, కొంటె చేష్టలు ఒక్కొక్కటిగా గుర్తుచేసుకుంటూ 60 ఏళ్లు దాటిన వృద్ధులంతా కుర్రకారుగా మారిపోయారు. వైద్య వృత్తిలో నిత్యం బిజీగా ఉంటూ దేశ విదేశాల్లో స్థిరపడిన సీనియర్ వైద్యులంతా రీ యూనియన్ పేరుతో శనివారం గుంటూరు వైద్య కళాశాలలో కలుసుకున్నారు. కళాశాలలో చేరి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ పేరుతో పూర్వ వైద్య విద్యార్థులు, సీనియర్ వైద్యులు ఒకచోటకు చేరుకుని జ్ఞాపకాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

85 మంది సీనియర్ వైద్యులు హాజరు

గుంటూరు వైద్య కళాశాలలో 1975 బ్యాచ్ వైద్య విద్యార్థులు 135 మంది ఉండగా, వారిలో 85 మంది శనివారం జరిగిన గోల్డెన్ జూబ్లీ రీయూనియన్ వేడుకలకు హాజరయ్యారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఇతర విదేశాల్లో ఉన్నవారు, దేశంలోని పలు రాష్ట్రాల్లో పేరు ప్రఖ్యాతలు గడించిన వైద్యులంతా సమ్మేళనానికి హాజరై సంతోషాన్ని పంచుకున్నారు. గుంటూరు వైద్య కళాశాలలో 1975 బ్యాచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఒకే ఏడాది రెండు ఎంబీబీఎస్ బ్యాచ్‌లు వైద్య కళాశాలలో చేరడం బ్యాచ్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

గురువులకు సన్మానం

సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ ఫణీంద్రకుమార్, ఎస్‌పీఎంకు చెందిన డాక్టర్ శివరామ్‌ప్రసాద్, ఫిజియాలజీకి చెందిన డాక్టర్ ఇందిరాదేవి, డాక్టర్ నాగేశ్వరరావులను 1975 బ్యాచ్ వైద్య విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ కార్యక్రమానికి హాజరయ్యారు. పూర్వ వైద్య విద్యార్థులు కళాశాల అభివృద్ధికి జింఖానా పేరుతో చేస్తున్న సేవలను కొనియాడారు. రీయూనియన్ పేరుతో వస్తున్న వారంతా గుర్తుగా వైద్య కళాశాలకు, జీజీహెచ్‌కు సాయం చేయాలని కోరారు. రీ యూనియన్‌కు ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయభాస్కర్ కన్వీనర్‌గా, డాక్టర్ తేజానంద్ గౌతమ్, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ రామకృష్ణ కోర్ కమిటీ సభ్యులుగా వ్యవహరించారు. రీ యూనియన్‌కు హాజరైన వైద్యులలో 65 నుంచి 67 సంవత్సరాల మధ్య వారే ఉన్నారు. వయస్సు పైబడుతున్నా ఉత్సాహంగా వేడుకలకు హాజరై అందరిని ఆశ్చర్యానికి గురిచేశారు.

తెలుగు నాటకరంగం- స్త్రీవాదంపై జాతీయ సదస్సు

- కేంద్రసాహిత్య అకాడమీ, వేదిక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు
- 26న యడ్లపాడులో రెండు విభాగాలుగా నిర్వహణ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

యడ్లపాడు: సాహితీరంగ ప్రముఖులు, తెలుగు నాటకరంగ ఉద్దండులతో సాహిత్య సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల వేదిక(తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన) అధ్యక్షుడు ముత్తవరపు సురేష్ బాబు తెలిపారు. శనివారం యడ్లపాడులోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర సాహిత్య అకాడమీ, వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన యడ్లపాడులో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'తెలుగు నాటకం – స్త్రీవాదం' అనే అంశాలపై రెండు విభాగాల్లో సదస్సుకు నిర్వహణకు శ్రీకారం చుట్టామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ ఇప్పటివరకు మహానగరాల్లో మాత్రమే ఇటువంటి సదస్సులు ఏర్పాటుచేసిందన్నారు. జాతీయస్థాయి తరహాలో ఓ గ్రామీణ ప్రాంతంలో ఈ సదస్సు నిర్వహించడం ప్రథమం కావచ్చన్నారు. మేధావులు, సాహిత్య పురస్కార గ్రహీతలు సైతం ఈ సదస్సుకు హాజరవుతున్నట్లు తెలిపారు. 'తెలుగునాటక రంగం–స్త్రీవాదంపై తమ కలాలతో, గళాలతో జనచైతన్యం చేసే దిశగా సదస్సులు కొనసాగుతాయన్నారు. 26వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక వేదిక కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. 11.30 వరకు ప్రారంభపు సభ ఉంటుందన్నారు. సాహిత్య అకాడమీ తెలుగు సలహాసంఘం సభ్యులు వల్లూరి శివప్రసాద్ స్వాగతోపన్యాసం, కథ, నవలా రచయిత్రి ఓల్గా కీలకోపన్యాసం, వేదిక ప్రధాన కార్యదర్శి జేవి మోహన్‌రావు వందన సమర్పణ చేస్తారన్నారు. 11.45 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మొదటి సదస్సు మొదలవుతుందన్నారు. అంబటి మురళీకృష్ణ అధ్యక్షతన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (నాటకం) స్త్రీ చైతన్యం, నిభానుపూడి సుబ్బరాజు (పద్యనాటకం) స్త్రీ అభ్యుదయం, సీహెచ్ సుశీలమ్మ (సంస్కరణోద్యమ నాటకాలు) స్త్రీ చిత్రణపై పత్ర సమర్పణ చేస్తారన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరిగే రెండో సదస్సుకు పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షత వహిస్తారన్నారు. దేవి (ఆధునిక వీధినాటకం) స్త్రీ వికాసం, నల్లూరి రుక్మిణి (నాటకం పురుషాధిక్యత– స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యం, జె.కనకదుర్గ (నాటకం) స్త్రీ వైవాహిక సమస్యల చిత్రీకరణపై పత్ర సమర్పణ ఉంటుందన్నారు. ఈ సదస్సులో మహిళలందరూ భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వేదిక సంయుక్త కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ముత్తవరపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే

నరసరావుపేట ఈస్ట్: విద్యావంతులైన యువతకు నైపుణ్యాలను పెంపొందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం జేసీ సూరజ్ గనోరే తన కార్యాలయంలో పీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి ఐటీఐ, పాలిటెక్నిక్, ఏదేని డిగ్రీ, బీఫార్మసీ వంటి విద్యార్హతలు, 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాల కలిగిఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను https:// pminternship.mca.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.5వేలు చొప్పున 12 నెలలు పాటు అందిస్తారని తెలిపారు. ఈనెల 21వతేదీ తుది గడువుగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7702921219, 9985212347 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.సిహెచ్.రామాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

'ఉల్లాస్'లో నిరక్షరాస్యులకు విద్య

నరసరావుపేట: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో చదువురాని స్వయం సహాయక సంఘ సభ్యులు, ఇతరులు ఉల్లాస్ శిక్షణా కార్యక్రమంలో తమ పేర్లను నమోదు చేసుకొని చదువు నేర్చుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పథక సంచాలకులు బాలూనాయక్ కోరారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహంలో ఏర్పాటుచేసిను జిల్లాస్థాయి ఉల్లాస్ శిక్షణా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సాధికారత సాధించేందుకు నిరక్షరాస్యులు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్మోహనరావు, నోడల్ అధికారి మల్లిఖార్జునరావు, సూపర్‌వైజర్లు శిరీష, రవి, గోవర్ధన్, నాగేశ్వరావు, జిల్లా సమాఖ్య ప్రతినిధి హనుమా నాయక్, ఏపీఎంలు పాల్గొన్నారు.

రూ.2.50 కోట్లు అప్పులు చేసి ఎరువుల వ్యాపారి ఉడాయింపు

మాచర్ల: పట్టణంలో ఎరువుల వ్యాపారి రూ. కోట్లు అప్పు చేసి పది రోజులుగా కనిపించకుండా వెళ్లిపోయాడు. వ్యాపారి ఆచూకీ కోసం అప్పులు ఇచ్చిన వారు ఆందోళనలో ఉన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎరువుల వ్యాపారం చేస్తూ చిట్టీపాటల వారికి డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితులు, తదితర వారి వద్ద రూ. 2.50 కోట్ల వరకు అప్పు చేశాడు. దుకాణానికి తాళాలు వేసి కనిపించకుండా వెళ్లిపోయాడు. అప్పులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారి కోసం గాలింపులు చేస్తున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంతకు ముందు కూడా ఇలాంటి ఘటన చేసి పెద్దలతో మాట్లాడుకుని గ్రామంలోకి అడుగు పెట్టాడు. జనంలో నమ్మకం పెంచుకుని అప్పులు చేసి మళ్లీ కనిపించకుండా పోవడంపై పట్టణంలో చర్చ జరుగుతోంది.

జెండా దిమ్మె కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి

డీఎస్పీ, మున్సిపల్ మేనేజర్లకు వైఎస్సార్ సీపీ నేతల వినతిపత్రాలు



మున్సిపల్ మేనేజర్ సాంబశివరావుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని 18వ వార్డులో వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను కూల్చినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివ రావులను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ 18వ వార్డులో జెండా చెట్టు దగ్గర ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను శుక్రవారం రాత్రి క్రేన్‌తో గుర్తు తెలియని దుండగులు పగలగొట్టారన్నారు. వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను పగలగొట్టిన దోషులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా జెండా దిమ్మెలను కూల్చడం మంచి సంప్రదాయం కాదన్నారు. ఇలాంటి ఘటనలు చేపట్టి రెచ్చగొట్టే ధోరణులను మానుకోవాలని హితవు పలికారు. వినతి పత్రం అందించిన వారిలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షురాలు రోళ్ల మాధవి, వైఎస్సార్ సీపీ నాయకుడు చలంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, తుమ్మల వెంకటేశ్వర రావు, తిరుపతిరావు, చంటి, తదితరులు ఉన్నారు.

కార్యకర్తల సమస్యలు తెలుసుకున్న పీఆర్కే

మాచర్ల: మాచర్ల పట్టణానికి శనివారం వచ్చిన వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని శనివారం పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. పీఆర్కే రాకను తెలుసుకున్న పలువురు ఆయా మండలాల నుంచి తరలివచ్చి ఆయన్ను కలిసి పలు అంశాలపై చర్చించారు. పార్టీ కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఆర్కేను కలిసేందుకు పలు ప్రాంతాల నుంచి మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల వారు తరలిరావటంతో కార్యాలయంలో సందడి నెలకొంది.

వలంటీర్ల నిర్బంధం ప్రజాస్వామ్యానికే కళంకం


- రూ.5వేల వేతనమైనా చాలు, వలంటీర్లను వెంటనే విధుల్లోకి తీసుకోండి
- వలంటీర్ల సంఘ రాష్ట్ర గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్



నరసరావుపేట: వలంటీర్లకు గత ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేర్చమని ఒత్తిడి తెచ్చేందుకు సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చిన రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ నాయకులను ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేయడం ప్రజాస్వామ్యానికే పెద్ద కళంకమని ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పాలకులు అంటే ప్రజలకు సేవకులని, ముఖ్యమంత్రి పైమెట్టు సేవకుడైతే, వలంటీర్లు అట్టడుగున పేద ప్రజానీకానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను సవ్యంగా, శీఘ్రంగా అందించే చివరి మెట్టు సేవకులని అన్నారు. ఇంతటి కీలకపాత్ర పోషించినందుననే గత ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ల వ్యవస్థకు దేశవ్యాప్తంగా మంచి పేరు వచ్చిందని తెలిపారు. అట్టి ముఖ్యమైన వ్యవస్థను, అందులోనూ పేద నిరుద్యోగ యువతీ, యువకులకు సంబంధించిన అంశాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం, వాగ్దాన భంగానికి పాల్పడటం, ఈ ప్రభుత్వ పతనానికి కారణం కాగలదని హెచ్చరించారు. రూ.10 వేలు ఇవ్వకపోయినా, రూ.5వేలు ఇచ్చినా చాలని, మా చిరు ఉద్యోగాలు మాకు ఇవ్వండని, బకాయి పడిన వేతనాలు ఇవ్వండని, ఆత్మహత్యలను ఆపండంటూ వారు చేస్తున్న విజ్ఞప్తిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెంటనే మన్నించాలని డిమాండ్ చేశారు. రెండున్నర లక్షల మందిని విధుల్లోకి తీసుకోవాలని సూచించారు. కావాలంటే పేరు మార్చి రెండున్నర లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లుగా సగర్వంగా చాటు కోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇంకా జాప్యం చేస్తే, ఈ యువజన ఉద్యమం మరింత తీవ్రమవుతుందని కూటమి నేతలు గుర్తెరగాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి



మాస్టర్ ట్రైనర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

నరసరావుపేట: పర్యావరణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లుగా పెంచి ఆక్సిజన్ లభ్యతను పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి పేర్కొన్నారు. వరల్డ్ అగ్రి ఫారెస్టు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్టు ఇన్ ఇండియా(టోఫీ) కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ట్రైనర్లకు సర్టిఫికేట్లు అందజేసే కార్యక్రమం శనివారం మున్సిపల్ అతిథి గృహంలో నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మురళి మాట్లాడుతూ దేశంలో ఉన్న భూ విస్తీర్ణంలో 30 శాతం అటవీ ప్రాంతం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్ సమయంలో ప్రతి ఒక్కరూ ఆక్సిజన్ కోసం వెంపర్లాడిన పరిస్థితి ఒక్కసారి గుర్తు చేసుకోవాలని కోరారు. మొక్కలు నాటి చెట్లుగా పెంచటమనేది ఒక సోషల్ యాక్టివిటీగా మారాలని కోరారు. ఉద్యానవన జిల్లా అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ఉద్యానవనం, ఫారెస్టు, అగ్రికల్చరల్ విభాగాలకు భాగస్వామ్యం ఉందన్నారు. రైతులకు పంటలతో పాటు వివిధరకాల మొక్కలను సైతం పెంచాలని శిక్షణ ఇచ్చిన మాస్టర్ ట్రైనర్లు అభినందనీయులని అన్నారు. ఫారెస్టు రేంజ్ అధికారి డి.వెంకటరమణ మాట్లాడుతూ అడవి బయట ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలనే దృక్పథం నేటి పరిస్థితుల దృష్ట్యా చాలా అవసరమని పేర్కొన్నారు. అనంతరం రైతులకు శిక్షణ ఇచ్చిన 48 మంది మాస్టర్ ట్రైనర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, స్టేట్ అసోసియేట్ ప్రణీత్ వర్మ, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు మణికంత, ప్రవీణ్ పాల్గొన్నారు.